# న్యాయం



చంద్ర

చైనులు ఇంకా చీకటి పడకుండానే గూడెం చేరేడు.

గూడెం మొగదల్లోనే నిలబడిపోయి అయిపోవచ్చిన చుట్టని చివరిసారిగా ఓ దమ్ములాగి వెనక్కి మురిక్కాలవ లోకి విసిరేసేడు.

అంతక్రితమే, ఇంకా సాయంత్రం నాలుగవకుండానే ఆ గూడెంలో పిడుగు పడింది. ఆ పిడుక్కి భూలోకమంతా కాకపోయినా, కనీసం ఆ వూరయినా కంపించిందో లేదో గాని గూడెం మటుకి తగలడిపోయింది.

ఆలా తగలడిన గూడెం ఇంకా చల్లా రనే లేదు.

చల్లారకుండానే చైనులు గూడెం చేరేడు.

చైనులు వొచ్చేడన్న సంగతి నిమిషాలమీద ఆ గూడెంలో జనానికంతా తెలిసిపోయింది.

అంతవరకూ — గూడెం మొగదల వరకూ స్పీడుగా వొచ్చినట్టుగా కాకుండా వేగం తగ్గించి, మొహమ్మీదకు కాస్తంత గంభీరాన్ని పులముకుని, కుడిచేతినున్న కడియాన్ని పైకి లాక్కుని గూడెంలోకి కదిలేడు.

పదడుగులు వేసి చింతకిందకు వచ్చేడోలేదో, "బాబూ! సైనులు బాబూ...నా కొంపారిపోనాది...నాపరువు మంట కలిసిపోనాది....నేను సచ్చిపోనాను బాబూ ... రచ్చించుబాబూ ... నన్ను

రచ్చించు. అంటూ సుడిగాలిలా దూసు కొచ్చిన రాజమ్మ చైనులు ముందున్న బురదకు అటువేపే నేలకంటుకు పోయింది.

చైనులుకి కోపం రాలేదు...కాని చిరాకుతో మొహంలోకి ముడుతలొచ్చినయి.

చైనులు అలా ఓ నిమిషం నిలబడీ నిలబడనట్టుగానే, రాజమ్మ ఏడుపుని వినీ విననట్టుగానే ముందుకెళ్ళిదిలేడు.

ఇందాక పడిన పిడుక్కి గుడిసెల్లో జనమంతా ఇప్పుడు బయటికి వొచ్చి గుంపులు గుంపులుగా నాయకునికి స్వాగతమిచ్చే ప్రజల్లా మంచున్నారు. గాని వాళ్ళలో ఉత్సాహంలేదు యముడికి భయపడి ఒదిగి దారిస్తూన్న పాపుల్లా గున్నారు.

చైనులు ఎక్కడా ఆగలేదు. చరచరా నడిచివెళ్ళి గూడెం మధ్య రావిచెట్టు కిందకు చేరేడు. చెట్టుకింద ఓ చెయి విరిగిన కుర్చీవుంది దానికి ఎడంపక్క పది అడుగుల దూరంలో అప్పిగాడూ,సూన్నారాయణా, లోగనాధం. పైడమ్మా, కొండలూ చేతులు కట్టుకు నుంచున్నారు.

చైనులు ఏమీ మాట్లాడకుండానే వెళ్ళి మౌనంగా ఆ కుర్చీలో కూచున్నాడు.

చైనులు కూచోంగానే కూడబలుక్కున్నట్టుగా చీమల్లా — ఇందాకంతా గుడిసెల ముందు చేరిన జనం వొచ్చి అర్థ చంద్రాకారంలో రావిచెట్టు కిందకు చేరేరు.

చైనులు ఓసారి తలెత్తి చుట్టూ చూసేడు.

ఎడంపక్క—మంత్రీ, సేనాధిపతే, అధికారులూ—

కుడిపక్కా, ఎదురుగా ప్రజలూ కనిపించేరు.

వెంటనే ఓసారి చిన్నగా దగ్గి మీసం మెలేసి ఆ మొండి కుర్చీలో వెనక్కి జేరగిలబడ్డాడు.

దూరంగా గుడిసెల వెనక అకాశం నల్లబడుతూంది. అకాశం అంచుల్లో మటుకు ఇంకా ఎరుపు, జరీ అంచులా మండుతోంది.

చెట్టుమీద కాకుల అరుపులూ—

చెట్టుకింద చీమల శబ్దం—

చైనులోసారి తలతిప్పేడు.

ఆ చూపులకి చివర మళ్ళీ — అప్పిగాడూ, సూన్నారాయణా, లోగనాధం, పైడమ్మా......

పైడమ్మ దగ్గర చూపాగిపోయింది.

శ్రీకృష్ణపరమాత్ముడి చూపులర్థం చేసుకున్న గోపికలా, పైడమ్మ ఒక ఢగు ముందుకువొచ్చి చిన్నగా నవ్వింది.

పరమాత్ములవారుకూడా నవ్వేరు. నవ్వినట్టే నవ్వి వెంటనే మూతిముడుచుకుని గంభీరుడైపోయాడు.

పైడమ్మ వెంటనే అక్కణ్నుంచి

కదిలి జనంలోంచి దారిచేసుకుని గుడిసెల వేపు వెళ్ళిపోయింది.

ఈ లోపునే ఎడంపక్క నుంచున్న సేనాధిపతి లోగనాథం వెళ్ళి మరో నిమిషానికల్లా ఓ గ్లాసులో నీళ్ళుతెచ్చి చైనులు కందించేడు.

గుక్కెడు నీళ్లుతాగి మింగకుండా నోరు గడ గడలాడించి, తుపుక్కున పక్కకి ఊసేడు ఆ పక్కకి తిరగటంలో కొంచెంగా ముందుకి వంగటంలో చైనులు మెళ్ళో పులిగోళ్ళున్న బంగారు పతకం సూర్యుడి చివరి వెలుగుకి తళుక్కున మెరిసింది. చొక్కాలోంచిబయట పడ్డ ఆ పతకాన్ని అతి కేర్‌లెస్‌గా ఇంకోసారి అందరికీ కనిపించేలా వేళ్ళతో ఊపి నీళ్ళుతాగి గ్లాసుని లోకనాథానికందించేడు.

ఆరిపోయిన సూర్యుడు ముద్దయిపోయి బిళ్ళగా మారి చైనులు మెళ్ళో వేళ్ళాడుతున్నట్టు—చుట్టూవున్న జనం ప్లస్ మంత్రీ, సేనాధిపతీ, అధికారులూ ...కళ్ళు ఇంతంత పెద్దవి చేసుకుని చూసేరు.

"చైనులీసారి పోలీసోళ్ళని కూడా కళ్లుకప్పి కనీసం రెండు బండ్లనిండయినా సరుకుని కంపెనీకి సప్లయి చేసుంటా" దని మంత్రీ—

'గురుదెక్కడో మాయచేసి, అందునా రెడ్డిగారి కళ్ళుకూడా కప్పేసివుంటా' దని సేనాధిపతీ—

'కష్టేఫలిః అన్నట్టు చైనులు బాబు చెమటోడ్చి సంపాదించుకుంటున్నా,"దని ప్రజలూ—అనుకున్నారు.

చైనులుకి చిరాకేస్తోంది.

ప్రక్కన ఎప్పుడూ మురికితప్ప మరేమీ ప్రవహించని కాలవలో పైమ వడివడిగా ప్రవహిస్తోంది.

చెట్టుకింద జనం ఎదురుచూపుల్తో కుతకుతలాడిపోతున్నారు.

ఆకాశం పూర్తిగా చీకటయిపోయింది.

అసలే రావిచెట్టు. మరింత చీకటిగా వుంది.

జనానికోమూల సందు చేసుకొని పైడమ్మ, రాజమ్మనీ దాని కూతురు సీతమ్మనీ తీసుకొచ్చింది.

రాజమ్మ వణుకుతోంది. గుండెల్లో పెనవేసుకున్న తాచుపాముల కదలికలా దుఃఖం మెలిదిరుగుతోంది. అది జనం మధ్యకి వస్తూనే, కండలేమీ మిగలక వేల్లాడుతున్న చేతుల్నెత్తి చెట్టుకింద చీకట్లోకలిసిపోయి చేయివిరిగిన కుర్చీలో కూర్చున్న పరమాత్ముడికి దణ్ణం పెట్టింది. అక్కడే నిలబడిపోయింది.

పైడమ్మ సీతమ్మ నొదిలేసి మెల్లిగా తన స్థానం చేరుకుంది.

జనమంతా సీతమ్మకేసి చూడకుండా చైనులుకేసే చూస్తున్నారు.

ఈ లోపునెవడో పరుగెత్తుకుంటూ వొచ్చాడు ఆ వొచ్చినవాడు చేతిలో హరికెన్ లాంతర్తో వొచ్చేడు.

అంతవరకూ ఆ చెట్టుకింద వున్న చీకటిపోయి, వొచ్చిన వెలుగు, మాసిపోయినట్టుగా వుంది.

ఆ వెలుగులో–తనకెదురుగా బోనులో మేకలానుంచున్న సీతమ్మని పరీక్షగా చూసేడు చైనులు.

దీపం వెలుగు సీతమ్మని తాకి దాని గుడ్డల్లోంచి ప్రసరించక అక్కడే ఆగిపోయింది. దాని వెనుకనున్న జనం నీడలో కలిసిపోయారు.

సూన్నారాయణ చకచకా అందరివేపూ ఓ చూపుచూసి చైనులుకేసి 'ఇంక కానివ్వొచ్చు' నని తలూపేడు.

సీతాలు తలెత్తకుండానే కళ్ళచివర్లలోంచి చైనులుకేసి చూసింది.

ఆ గుడ్డివెల్తురులో మొండికుర్చీలో చింతమొద్దులా నల్లగా కనిపించేడు.

"రాజమ్మా! నువు కొంచెం ముందుకి రాయే!" అన్నాడు చైనులు.

రాజమ్మ రెండడుగులు ముందుకు వచ్చి పొర్లుకొచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక రాగం సాగదీసింది. 'నా దేవుడోయ్ ...నను కాపాడునాయనోయ్'...అని.

"సరె సర్లే! ముందు జరిగిందేటో చెప్పు! అనక తీరిగ్గా ఏడుద్దుగాని" అన్నాడు చైనులు చిరాగ్గా.

"ఇంకేటి సెప్పేదిబాబూ...నా దీపం అరిపోనాది...నా పరువు మంటగలిచిపోనాది. అడు...ఆ దొంగ నాయాలగాడు ...ఆ సచ్చినోడు బతికిపోనాడు బాబూ...అణ్ణికూడా పిలిపించుబాబూ ...నానేం సెప్పేది?...ఆ మాయలోడ్నే సెప్పమను బాబూ..." అంది రాజమ్మ.

చైనులు సీతమ్మకేసి ఒక్కక్షణం చూసేడు.

తనకెదురుగా మోకాళ్ళవరకూ చాలీచాలని గుడ్డల్తో విరిగిన వీనస్‌లా తలొంచుకొని వుందది.

దానికింకా ఈ లోకంలో మాయ సంగతి తెలీని వయసు

సూన్నారాయణ చైనులు ముందుకొచ్చి, "ఈళ్ళనడిగి ఏటినాబం గుకో... ఎదవసొద ఏటీజరగదు గానీ...ఆ బాబుని గూడా పిలవమంటే పిలుత్తా...నేపోతే నను సెప్పమంటే సెప్తా" నన్నాడు.

చైనులు సరేనన్నట్టు తలూపేడు.

"సినరెడ్డిగారు నాలుగంటశేలప్పుడే గూడేనికొచ్చినాడుట. లింగడు కనిపించి అడిగితే–సినేమా హాలుదగ్గర వనుండాదీ...లేబరు కావాలని సెప్పినాడంట. ఈ టైముకెవరేనా దొరుకుతారా అనీ అడిగినాడంట. అనేసి లింగడి జవాబినిపించుకోకుండానే ఎళిపోయి రాజమ్మ గుడిసె తలుపుతట్టినాడంట. 'రాజమ్మా' అని పిలిసినాడంట. సీతమ్మ తలుపుతీస్తే నవ్వుతూ లోపలికి ఎళిపోనాడంట. లింగడు ఎనక్కి ఎళిపోనాడంట. పావుగంట తరువాత సింతకింద కూకున్న లింగనికి రెడ్డిబాబు అదరాబాదరా టౌనుకేసి పోవటం కనిపించినాడంట. ఇట్లా రెడ్డిబాబు బయి




టికి రావటం అట్టా రాజమ్మ గుడిసెలోకి దూరటం ఒకే టయానికి జరిగినాదట.

“ఈ ముండ మరి సినరెడ్డిగారు సీతమ్మని బలవంతంగా సెరిసినాడని సెప్తా వుంది. మరి నీ నిర్ణయం కావాల. అయితే అసలు ఇసయమేందో ఆ రెడ్డిబాబుని కూడా ఇసారిస్తే బాగుంటాది.” అని గుక్కతిప్పకుండా చెప్పేడు సూన్నారాయణ.

చైనులు రెండు క్షణాలు ఆలోచించి “సరే చినరెడ్డిగార్ని ఇషయం తెలుసుకుందాం” అని “రాజమ్మా—సూన్నారాయణ చెప్పిందేగదా జరిగింది? ఆ రెడ్డిబాబు నీ కూతుర్ని బలవంతంగా సెరిసినాడనేగా నువు చేప్పేదీ!” అని రాజమ్మ నడిగేడు.

“కాదు బాబూ ... బలవంతంకాదు బాబూ...పాణాలు తోడేసినట్టు సెరిసినాడు బాబూ...” అంది రాజమ్మ మళ్ళీ రాగాల్తో.

చైనులు కుర్చీలోంచి లేచి రెండు పార్లు జనం మధ్య అటూయిటూ నిలువుగా నడిచి, సూన్నారాయణ దగ్గరికొచ్చి “నువుబోయి రెడ్డిబాబుని పిలు రానంటాడేమో—ఆయనెంత డబ్బున్నోరయినా నాయెంకోసం రమ్మన్నారనిచెప్పు. ఇంకా ఈ భూమ్మీద నాయెం, నీతీ ఉన్నాయనీ, దేవుడున్నాడనీ చెప్పు. రాకపోతే బాగుండదనీ నిజం ఏంటో ఆయన్నే అడగటానికి జనం నిలబడ్డారనీ చెప్పు. ఎళ్ళు బేగెళ్ళు—ఉన్న పళాన లగెత్తు” అని అందరికీ వినిపించేలా గంభీరంగా పులిలా అన్నాడు.

"రైటో గురూ—" అని కదల బోయిన సూన్నారాయణ్ని ఆపి బుజం మీద చెయ్యేసి— "జాగర్త. రెడ్డిబాబుని ధైర్యంగావుండమను. నిజాన్ని గుండెల్లో ఎట్టుకుని రమ్మను." అని మెల్లిగా అన్నాడు.

జనం గుండెల్లో రైళ్ళు పరుగెడు తున్నాయి.

సూన్నారాయణ సైకిలేసుకుని టౌను కేసి బాణంలా దూసుకుపోయాడు.

చైనులు మళ్లీ కుర్చీలో కూచుని, "పైడమ్మా! మీఅమ్మ కెట్టుండాదే?" అని అడిగేడు.

"అంతంత లానే వుండాది. మనిషి సగమైపోనాది" అంది పైడమ్మ తల్లి చావుకు దగ్గరయిందన్న బాధ దానికళ్లలో లేదు. వుందల్లా—చైనుల్తో గడిపి దాదాపు నెలవు తోందన్న బాధ. ఎప్పుడెప్పుడు చైనులు చేతుల్లో పడిపోదామన్న కోరికా వున్నయి.

"బాగా సిక్కి పోయిందశే. పద సూసొద్దాం!" అంటూ లేచి పైడమ్మతో గుసగుసలాడుతూ దాని గుడిసెకేసి వెళ్ళాడు.

అప్పటికింకా ఎవరి గుడిసెలోనూ దీపం వెలగలేదు. గూడెమంతా చీకటిగా వుంది.

అందరూ రావిచెట్టుకిందకి తన తీర్పు కోసం చేరారు.

చైనులు ఓసారి వెనక్కి చూసి, పైడమ్మ భుజంమీద చెయ్యేసి గుడిసె లోకి చేరేడు.

*   *   *

గూడెం జనం మధ్య తను దిగంబ రంగా నుంచున్నంత బాధగా వుంది సీతమ్మకి.

'ఇంకేటి సూసుకుని బతకను?' అను కున్నది.

*   *   *

"గురూ గురూ! రెడ్డిబాబొచ్చినాడు." అని తలుపు తట్టేడు అప్పిగాడు.


క్షణం తరువాత చైనులు పైడమ్మ గుడిసెలోంచి గబగబా బయటకువచ్చి సభకి చేరేడు.

అక్కడ చినరెడ్డిగారు చేయివిరిగిన కుర్చీలో కూచుని సిగరెట్టుతాగుతూ వొది లిన పొగలోంచి సీతమ్మని చూస్తున్నాడు.

అతనికి ఆపొగలోంచి సీతమ్మ సాలె గూడులో ఇరుక్కున్నట్లు కనిపిస్తోంది.

చైనులు ఓసారి గొంతుసవరించు కొని, అతిభీకరంగా పోజెట్టి "అయ్యా రెడ్డిబాబూ! మీరన్నాయంగా బలవంతంగా రాజమ్మ గుడిసెలోకి దూరి, దానికూతురు సీతమ్మని సెరిసినారని మీ మీద నేరం... మీరు నాయెంగా, దేవునిమీద ఆనెట్టి నిజెం చెప్పండని మా గూడెం తరపున అడుగుతున్నా..." అని కాసేపాగేడు.

చినరెడ్డి తాగుతున్నసిగరెట్టుని కిందకు విసిరి కోపం నటించేడు




"ఇందులో మీకు కోపం రావాలిసిన మాటలేదు. మీరు డబ్బున్నోరు మేం లేనోళ్ళం. మాకు చెయ్యాడితేగాని కడుపు నిండదు. మీరు ప్రభువులు, మేం పేదోళ్ళం. మీరు బంగారం తినేవోళ్ళు మేం మట్టితినేవాళ్ళం. కాదనను. గాని మీరూ మనుషులే. మేమూ మనుషులమే. మీరూ మేమూ ఈ భూమ్మీద పుట్టినందుకు సమానంగా నాయెంగా బతకాలి ఏమంటారు?

"మేమేనాడయినా మీరుండే భవంతుల్లో వుండాలని కలలు గన్నామా? మీరు తినేతిండి తినాలని కోరుకున్నామా? మీ ఆడోళ్ళమీద కన్నేసామా? కనీసం మీ ఆడోళ్ళముందు తలలయినా ఎత్తామా? లేదు గద. మరి మీరిట్లా మా గుడిసెల్లో కొచ్చి మాగుంటల్ని చెరిస్తే నాయం ఏది? దర్మమేది? చెప్పండి. మా గూడెంవోళ్ళ ముందు నిజం చెప్పండి" అని గుండెల్లో భయం బుసలుకొడుతున్నా పైకిమటుకు అతికోపంగా అన్నాడు.

చినరెడ్డి, "అన్యాయం చైనులూ. నువ్వన్నట్టుగానే మేమూ ఎప్పుడయినా మీ గుడిసెల్లో వుందామనుకున్నామా? మీతిండి తినాలనుకున్నామా. అసలు మీకూ మాకు పొత్తేవిటీ అంట? అయితే ఆవాళ్ళసంగతంటావా ? మీ ఆడోళ్ళే మావెనకాల పడతారని ఎవరికి తెలీదు. ఇప్పుడీ ముండ నేనే బలవంతంగా చెరి

చానని న్యాయెంకోసం కొలువు కొచ్చిందా? ఇంత నాటకం ఆడుతుందా? ఆడముండ. దానికే సిగ్గులేకపోతే నాకేంవిటీ అంట? నిజం చెప్పమన్నావా? అయితే విను. ఇది మా సినేమా హాలుదగ్గిరికి కూలీ కొచ్చినప్పట్నించీ నాకు తెలుసు. దానికి మనసయి కబురు పంపితేనే వొచ్చాను.

"మనసు లేనప్పుడు కట్టుకున్న మొగోడు మీద చెయేస్తే కసురుకునే కాలం... అలాంటిది నేను బలవంతం చేస్తావుంటే ఒక్క అరుపయినా అరిచిందా? నిజంగా అది చెప్పిందే నిజమైతే ఎదురు తిరగదా? నలుగుర్నీ కేకేసి చావగొట్టించదా? ఏమిటి చైనులూ— ఇప్పుడు చెప్పమను దాన్ని?" అని విశ్వరూపం దాల్చేడు చినరెడ్డి.

గూడెం జనం స్తబ్ధులైపోయారు.

"బాబోయ్! ఈడు నాకే దెబ్బకొడుతున్నాడ్రోయ్! దొంగసచ్చినోడు సచ్చిపోనూ?" అని రాజమ్మ శివాలెత్తిపోయింది

సీతమ్మకి తలతిరిగిపోయింది. కళ్ళు బైర్లుకమ్మినయి. అదురుతున్న గుండెని ఆపుకోలేక నేలమీద కూలబడిపోయింది. 'అయితే ఆళ్ళ ఆడజనం అలాంటప్పుడు అరుస్తారు గాంవోంసు' నని అనుకుంది సీతమ్మ.

"సీతమ్మా... సీతమ్మా! విన్నావా రెడ్డిబాబు మాట. నువ్వేటంటావు?" అని చైనులడిగేడు.

సీతమ్మ ఏమీ మాట్లాడలేదు. రాజమ్మ బూతులు తిడుతున్నది. ఏడుపు లంకించుకుంది

చైనులు ఇంకోసారి, 'సీతమ్మా! టైమయి పోతావుంది. నువ్వేటయినా చెప్తావా?" అని అడిగేడు.

సీతమ్మ మెల్లిగా 'ఏమీ లేద' న్నట్టు తలాడించింది.

చినరెడ్డి కుర్చీలోంచి లేచి ఇంకో సిగరెట్టు వెలిగించుకుని చైనులు కేసి చూసి పెదాల్ని కదిలించకుండానే కళ్ళతోనే నవ్వి సైకిలెక్కి వెళ్ళిపోయేడు.

అక్కడున్న చైనులుకి, మిగతా రెడ్డి తాలూకు జనానికీ గుండెలమీంచి బరువు తీరిపోయింది. గుండెల్లో మంట తగ్గిపోయింది.

చైనులు వెంటనే సీరియస్‌గా ముఖం పెట్టి— "నిజంగా చినరెడ్డి సీతమ్మని బలవంతంగా చెరిచివుంటే ఎదురు తిరిగి నలుగుర్నీ పిలవలేదంటే నిజంగానే అది మనసయ్యే ఆయన్ని పిలిపించుకునుండాలి. కాకపోతే మరి సీతమ్మ రెడ్డిగారన్నట్టు ఎందుకు అరవలేదూ?—ఎందుకు నలుగుర్నీ పిలవలేదూ?—"

"శ్రీకృష్ణపరమాత్ముడు ఏంచెప్పేడు? దుష్టశిక్షణకీ శిష్టరక్షణకీ గదా తను అవతారమెత్తుతాడని!

"అలాంటప్పుడు రెడ్డిబాబు చెప్పింది అబద్ధమని అనుకుంటే మరి సీతమ్మ చేసిందేవింటి? అన్యాయానికీ, దౌర్జన్యా

నికీ ఎదురు తిరక్కపోవటం మరి మన తప్పేగదా?" అని నాలిక్కరుచుకుని, "అందువల్ల రెడ్డిబాబు చెప్పిందానికి సీతమ్మ జవాబు లేదు గనుక ఇంక కేసు లేదు" అని తన తీర్పుని ముగించేసి గబగబా అక్కణ్ణుంచి తన మనుషుల్తో వెళ్ళిపోయేడు.

రాజమ్మ ఏడుపుకి తిట్లుకూడా జత కలిసినయ్.

జనం ఒక్కొక్కళ్ళే అక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నారు.

కాస్సేపటికి హరికేన్ లాంతరు కూడా లేని ఆచెట్టుకింద చీకట్లో సీతమ్మా, రాజమ్మా మటుకే మిగిలిపోయేరు.

గుండెల్లోకి పీరసం వొచ్చేదాకా రాజమ్మ తిడుతూనే వుంది. ఆయాసంతో రొప్పుతోంది.

సీతమ్మ మెల్లిగా తల్లి కేసి చూసింది.

తన గుండెల్లో రెడ్డీ, తల్లిగుండెల్లో చైనులూ బాకులు దిగేసినట్టు సీతమ్మ ఒక్కసారి ఊగిపోయింది.

* * *

రాత్రి రెండు గంటలవుతున్నది.

ఆకాశంలోనూ, ఊళ్ళోనూ చీకటి వుంది.

ఆ గదిలో వెన్నెల ఎర్రగా వెలుగుతూంది.

ఆ వేళప్పుడు — ఆ వెన్నెల లాంటి ట్యూబ్‌లైట్ల కాంతిలో సింహాసనం మీద చినరెడ్డిగారు విలాసంగా వాలుగాకూర్చువి వున్నారు. ఎదురుగా కుర్చీల మీద చైనులూ, సూన్నారాయణా కూచును న్నారు. వాళ్ళప్పటికే స్వర్గానికి మైలు దూరంలో వున్నారు.

వాళ్ళకళ్ళకి రంభా ఊర్వశులు లీలగా కనిపిస్తున్నారు. ఇంద్రుడు మటుకు ఎదురుగానే కళ్ళుమూసుకుని వున్నాడు.

వాళ్ళమధ్య టేబిల్‌మీద రకరకాల మందులూ, వాటికి సరిపడా తిండిపదార్థాలూ చిందరవందరగా పడివున్నై.

చైనులుకీ, సూన్నారాయణకీ, కళ్ళు సగం మూసుకుపోయి వున్నై.

కళ్ళుమూసుకుని మత్తుని ఆనందిస్తున్న చినరెడ్డి ఉన్నట్టుండి కిసుక్కున నవ్వేడు

చైనులూ, సూన్నారాయణా ఉలిక్కిపడితేరుకుని, "రెడ్డిగారెందుకో నవ్వేరు" అన్నారు ఒకేసారి.

"ఏమీలేదు. ముందుగా వొచ్చి ఈ సూన్నారాయణగాడు చెప్పకపోతే, ఒరే చైనులూ — నువ్వక్కడ మాట్లాడిన మాటలకి నీ తలకాయ ఈపాటికెక్కడుండేదోనసి"... అన్నాడు రెడ్డి.

"చిత్తం చిత్తం" అన్నారు ఇద్దరూ.

మొత్తానికి భలే తెలివైనవాడివిరా చైనులూ" అన్నాడు మళ్లీ చినరెడ్డి.

"ఏదో తమదయ. నేను కూడా ఇంకా ఆ గూడెంలోనే వుండిపోతే నెనూ వాళ్ళలాగే వుండేవోణ్ణి. ఏదో తమదయవల్ల మొదట్లో పెట్టుకున్న సైకిలుషాపూ-తరు

వాత్తరవాత పెదరెడ్డిగారిచల్లనిచూపులవల్ల కంపెనీలకి సాహా సరఫరా మొదలెట్ట బట్టేగదా ఈ మాత్రం తెలివైనా వొచ్చి నాది అని చైనులు అతి వినయంగా చేతులు నలుపుకుంటూ అన్నాడు.

రెడ్డిగారు 'ఊఁ' కొట్టి మళ్ళీ నిద్ర లోకి జారుకున్నారు.

"అయినా రెడ్డిగారూ..మీకో గమ్మత్తు చెప్పవాండీ..." అన్నాడు చైనులు.

కళ్ళుతెరిచిన రెడ్డిగారు ఏమిటన్నట్టు చూసేరు.

"మా వాళ్ళని కాదని గూడెం వొది లేసి దూరంగా మీలో కలిసిపోయి ఏదో నాలుగు రాళ్ళు సంపాదించుకొని ఏ ఏడా దికోరెండేళ్ళకోతప్పగూడెంవెళ్ళనినామీద వాళ్ళకెంత నమ్మకమనీ! గూడెంలో ఏ తగువొచ్చినా తీర్పుకి నన్నే పిలుస్తా రండీ! అదీ తమాషా! నా మీద వాళ్ళకా నమ్మకమే లేకపోతే, నన్ను వాళ్ళ మని షినే కాదనుకుంటే ఇవాళ్టి కథ ఇంకోలా వుండదా?" అన్నాడు చైనులు.

చినరెడ్డి ఓసారి ఉలిక్కిపడి తర్వాత భయంకరంగా నవ్వి, "అయినా వాళ్ళు నిన్ను వొదులుకున్నా, నువు వాళ్ళని వొదల్లేవుగా. లేకపోతే, ఒరేయ్ చైనులూ నువు దాన్ని, ఆ పైడమ్మని వొదల గలవా?" అన్నాడు.

చైనులు ఏమీమాట్లాడకుండా 'చిత్రం' అని వూరుకున్నాడు.

గోడగడియారం నిజం అన్నట్టుగా రెండు గంటలు కొట్టింది.

"ఇంక లేద్దామా, నిద్రొస్తున్నది" అని చినరెడ్డి లేచేడు.

"అలాగే" అని జేబులోంచి రూపా యల కట్టతీసి అందులోంచి పది రూపా యలుతీసి సూన్నారాయణ చేతికిచ్చేడు చైనులు.

"వుంటామండీ" అని ఆ యిద్దరూ సెలవు తీసుకుని బయటికి చీకట్లోకి నడి చేరు. ఆ వీధి చివరి వరకూ వొచ్చి, సూన్నారాయణ చైనులు దగ్గర సెలవు తీసుకునిగూడెంవెళ్లే మట్టిరోడ్డునెక్కేడు. చైనులు ఇంటికి బయల్దేరేడు. టౌన్లో ఎక్కడా వెలుగులేదు. వీధి దీపాలు వెలగటంలేదు.

కళ్ళుమూస్తూ తెరుస్తూ యిల్లుచేరుకుని తలుపు తట్టబోయి 'అమ్మో' అని అరి చేడు.

చైనులు ప్రాణాలు బద్దలైన తల లోంచి కొంచెంకొంచెంగా బయటికి వస్తూంటే, మత్తొదిలిన కళ్ళకి చీకట్లో కలిసిపోతూ సీతమ్మ కనిపించింది.

"సీతమ్మా నువ్వా?" అన్నాడు నీర సంగా.

"నానే సైనులుబాబూ! నానే! ఇందాక నీ తీరుపు బాగుండాది. నానిప్పుడే కళ్ళు తెరిసినానుబాబూ! నీ న్యాయం, నాకిప్పుడే అర్థమయినాది బాబూ" అంది సీతమ్మ.

✲